క్లుప్తంగా

13 నుంచి రక్తదాన శిబిరాలు ఏర్పాటు

మదనపల్లె సిటీ: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 12 నుంచి 15వతేదీ వరకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబుబక్‌సిద్దిక్ తెలిపారు. 12న మదనపల్లెలో ప్రపంచ రక్తదాత దినోత్సవం లోగోను సాల్ట్‌తో ఆర్ట్ వేసి ప్రదర్శన చేస్తామన్నారు. 13న మదనపల్లె పట్టణం బెంగుళూరు బస్టాండులో రక్తదాన శిబిరంతో పాటు ఉచిత రక్తవర్గీకరణ, జూన్ 15న ములకలచెరువులో రక్తదాన శిబిరంతో పాటు ఉచిత రక్తవర్గీకరణ కార్యక్రమాలు చేస్తామన్నారు. రక్తదాతలు ముందుకు వచ్చి రక్తం దానం చేయాలని కోరారు.

సీడీపీఓగా సుజాత

తంబళ్లపల్లె: ఐసిడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా సుజాత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో మదనపల్లె సీడీపీఓ పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టులో గతంలో కూడా పని చేసిన అనుభవం ఉందని, అందరి సహకారంతో ప్రాజెక్టు కృషి చేస్తూ లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

వేరుశనగ విత్తనకాయలు పంపిణీ

కలికిరి: మండల పరిధిలో బుధవారం రాయితీ వేరుశనగ విత్తన కాయలు పంపిణీ ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి జీఆర్ మమత తెలిపారు. కె6 రకం 300 క్వింటాళ్ళు, నారాయణి రకం 690 క్వింటాళ్ళు, టీసీజీఎస్ రకం 100 క్వింటాళ్ళు మండలానికి కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. రైతులు విత్తనకాయలను తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రాయితీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెండు ఎకరాలకుపైగా భూమి ఎంత విస్తీర్ణంలో ఉన్నా కూడా ఒక్కో రైతుకు రెండు బస్తాల కాయలను ఇస్తామని ఏఓ ప్రేమలత తెలిపారు.

ఇద్దరికి ప్రతిభా పురస్కారాలు

బి.కొత్తకోట: స్థానిక భగవాన్ సాయిరాం పాఠశాలకు చెందిన ఇద్దరు 10వ తరగతి విద్యార్థులు ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలను అందుకున్నారని కరెస్పాండెంట్ బి.సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. కే.వర్షిణీ 588 మార్కులు, జి.సాహితి 588 మార్కులు సాధించారు. వీరికి కలెక్టర్ రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసాపత్రాలను అందజేశారని తెలిపారు.

హామీల అమలు కోసం 23న ఆందోళన

మదనపల్లె: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం జిల్లా అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళీ తెలిపారు. బుధవారం ఆందోళన కార్యక్రమ కరపత్రాలను మదనపల్లెలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల పనులు, రహదారులు, గ్రామాల అభివృద్ధి, టమాట రైతులను ఆదుకోవడం, పరిశ్రమల ఏర్పాటు తదితర హామీలను అమలు చేయాలని ఆందోళన ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు తహసీల్దార్‌గా శివకుమార్

పీలేరు : పీలేరు తహసీల్దార్‌గా శివకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న భీమేశ్వర్‌రావు బదిలీపై రాయచోటి కలెక్టరేట్‌కు వెళ్లారు. రైల్వే కోడూరులో డీటీ పని చేస్తున్న శివకుమార్ బదిలీపై పీలేరుకు వచ్చారు. బుధవారం ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ

తంబళ్లపల్లె: ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం మల్లయ్యకొండ భక్తులతో కిటకిటలాడింది. మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ మునిరాజు, కొండకిట్టల ఆధ్వర్యంలో దేవస్థానం తరపున భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఏనుగుమల్లమ్మ ఆలయంలో పూజారులు శేఖర, విజయకుమారి దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకణతో పూజలు చేశారు.

వ్యవసాయాధికారి బదిలీ

కలికిరి: మండలంలో పని చేస్తున్న వ్యవసాయాధికారి జీఆర్ మమతను తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి.. అలాగే వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారి ఎం.హేమలతను కలికిరి మండల వ్యవసాయాధికారిగా బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వారు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

ఆగిన నాడు-నేడు పనులు




ఆగిన నాడు నేడు వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల పనులు, మదనపల్లె జెడ్పీ ఉన్నతపాఠశాలలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

- అసౌకర్యాలతో బడులు
- నేడు పాఠశాలలు పునః ప్రారంభం

మదనపల్లె సిటీ: విద్యాశాఖలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ఇందులో భాగంగా నాడు-నేడు కింద పలు పాఠశాలలు నిర్మించారు. కొత్త భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రెండో విడత కింద ప్రారంభించిన నాడు-నేడు పనులు కూటమి ప్రభుత్వం రాగానే ఆగిపోయాయి. మదనపల్లె అర్బన్, మండల పరిధిలో మొదటి విడత కింద 1151.16 లక్షలతో 35 పాఠశాలల్లో నాడు-నేడు కింద ఎంపికయ్యాయి.నూతన భవనాలు, అదనపు భవనాలు, ఆధునిక సౌకర్యాలు కల్పించారు. రెండో విడత 2832.24 లక్షలతో 76 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో కేవలం 12 పాఠశాల్లో పనులు పూర్తి చేశారు. మిగిలిన పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా నాడు- నేడు పనులను పూర్తి చేయకుండా జాప్యం చేయడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల నాడు-నాడు కింద అదనపు తరగతి గదులు కింద రూ.10 లక్షలు అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం మంజూరు చేసింది. తరగతి గదులు నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 1000 మందికిపైగా విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు 24 గదులు ఉండగా అందులో మూడు గదులు ఆఫీసు, ల్యాబ్, స్టోర్‌రూములకు ఉపయోగిస్తున్నారు. అదనపు గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం ఆగిపోయాయి. పాఠశాలలో సుమారు 1500 మంది విద్యార్థులు ఉన్నారు. గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం నాడు-నేడు కింద నిర్మాణంలో ఉన్న భవనాలను నిధులు మంజూరు చేయకుండా నిలిపివేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వెంటనే పనులు పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పూలబండిని సాగిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: వర్షాలు సమృద్ధిగా కురిసి పల్లెలు పాడిపంటలతో, ప్రజలు ఆయు ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని చల్లంగా ఉండేలా చూడమ్మా అని ఎర్రగుంట్ల గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పూజలు నిర్వహించారు. బుధవారం ఆయన కన్నెమడుగు, తంబళ్లపల్లెల్లో పర్యటించారు. మల్లయ్యకొండ కింద శివపురం రోడ్డులో వెలసిన శ్రీ ఎర్రగుంట్ల గంగమ్మ జాతరకు ఆయన హాజరయ్యారు. అమ్మవారికి ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు ఎద్దుల బండిని పూలతో అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు సమర్పించి ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కన్నెమడుగులో ప్రజలతో మమేకమై వారిని పేరు పేరున పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కరీమ్, నాయకులు రామమూర్తి, ఆనందరెడ్డి, నారాయణరెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి పారాయణం



గుర్రంకొండలో రామకోటి కార్యక్రమం నిర్వహించిన భక్తులు

గుర్రంకొండ: పట్టణంలోని ఓనీ ఆంజనేయస్వామి ఆలయంలో రామకోటి పారాయణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 24 గంటల పాటు నిరంతరాయంగా రామకోటి పారాయం నిర్వహించే కార్యక్రమం బుధవారం ఉదయం ప్రారంభమైంది. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని పారాయంలో పాల్గొన్నారు. ఏరువాక పౌర్ణమి రామనామాన్ని జపిస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారికి భక్తులు, రైతులు పూజలు చేశారు. గురువారం ఉదయం వరకు రామకోటి పారాయణం నిరాఘంటంగా నిర్వహిస్తామని ఆంజనేయస్వామి మాలాధారణ గురువు శ్రీనివాసులు తెలిపారు. రామకోటి సందర్భంగా ఉదయనుంచి రాత్రి వరకు ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తిరువీధి శ్రీధర్, మల్లయ్య, ఈశ్వరయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

జాతీయ నీటి అవార్డుకు దుబ్బిగానిపల్లె

- పనులు పరిశీలించిన కేంద్ర బృందం
- గ్రామస్తులతో ముఖాముఖి



నీటి సంరక్షణ కుంటను పరిశీలిస్తున్న బృందం

మదనపల్లె: ఆరవ జాతీయ వాటర్ అవార్డుకు మదనపల్లె రూరల్ మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ అవార్డు కోసం పరిశీలనలోకి వచ్చింది. నీటి సంరక్షణ, వాటివల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాల ఆధారంగా కేంద్రం ఈ అవార్డును ఇస్తుంది. ప్రస్తుతం దుబ్బిగానిపల్లె పంచాయతీలో కనిపించిన ఫలితాల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేయడం కోసం కేంద్రం పరిశీలనలోకి తీసుకుంది. దీనితో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించేందుకు బుధవారం కేంద్రప్రభుత్వ బృంద సభ్యులు డాక్టర్ ఎస్‌కే ఎండీ.సర్తాజ్‌ఖాన్, సీజీడబ్ల్యూబీ శాస్త్రవేత్త సత్యమూర్తి పంచాయతీకి వచ్చారు. వీరికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరత్న వాటర్‌షెడ్ పథకం ద్వారా చేపట్టిన పనులు, వాటి ఫలితాలను సభ్యులకు వివరించారు. 2022 నుంచి ఇప్పటి వరకు వాటర్‌షెడ్ పథకం కింద రూ.74 లక్షలతో చేపట్టిన నీటి కుంటలు, నీటి ఊటకుంటలు, రాతి కట్టడాలు, చెక్‌డ్యామ్‌లు, అమృత సరోవర్లు, ఫాంపండ్లు పరిశీలించారు. వాటిలో నీటినిల్వ తీరును తిలకించారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించి నీటి సంరక్షణ చర్యలతో కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన చేసిన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలు, వాటి ఫలితాలు, గ్రామస్తుల అభిప్రాయాలను కేంద్రానికి నివేదించనుంది. ఈ నివేదిక ఆధారంగా దుబ్బిగానిపల్లె పంచాయతీ జాతీయ వాటర్ అవార్డుకు ఎంపిక కానుంది. ఈ అవార్డు దక్కితే మదనపల్లెకు జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఏపీఎం చెన్నకేశవ, వాటర్‌షెడ్ లక్ష్మినరసయ్య, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రభుత్వ, ఏపీఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్‌కు, బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ వినతిచేశారు. బుధవారం మదనపల్లె పర్యటనకు వచ్చిన లంకా దినకర్‌ను, స్థానిక మార్కెట్‌కమిటీ కార్యాలయంలో కలిసిన పునీత్, ఎస్టేట్‌లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ..ఎస్టేట్‌లో పరిశ్రమల కోసం స్థలాలు తీసుకుని, తర్వాత ఇతర వ్యాపారాల కోసం భవనాలు నిర్మిస్తున్నారన్నారు. ఏపీఐఐసీ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లు, మూడు, నాలుగు అంతస్థుల భవనాలను ఎలాంటి ప్లాన్ అప్రూవల్ లేకుండా నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, వినయ్, సాయి, బ్రహ్మ, శశి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

– పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి



పీలేరు : అక్రమ కేసులకు భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు దాడి చేయడం అమానుషమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి గురించి పట్టించుకోకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులపై, కార్యకర్తలపై లేనిపోని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. డిబేట్స్‌లో ఓ వ్యక్తి చేసిన వాఖ్యలను సాక్షి మీడియాపై ఆపాదించి దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని కూటమి ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

పాలేటి గంగమ్మ..చల్లంగ చూడమ్మా



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాలేటి గంగమ్మను దర్శించుకుంటున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : పాలేటి గంగమ్మ ప్రజలందరినీ చల్లంగ చూడు తల్లీ అంటూ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అమ్మవారిని ప్రార్థించారు. మండలంలోని చిప్పిలి గ్రామదేవత పాలేటి గంగమ్మ జాతర సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆహ్వానం మేరకు నిసార్‌అహ్మద్ కార్యక్రమానికి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను స్వాగతించి ప్రత్యేక పూజలు చేశారు. దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా గాయన మాట్లాడుతూ...చిప్పిలి పాలేటి గంగమ్మ అత్యంత మహిమాన్విత దేవతగా తరతరాల నుంచి పూజలు అందుకుంటోందన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ తర్వాత.. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పట్టణంలో వైఎస్సార్ సీపీ యువనాయకులు పవన్ తేజ, 15వ వివాహ వార్షికోత్సవ వేడుకలు హాజరై దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, ఎన్‌ఆర్‌ఐ దండుశేఖర్‌రెడ్డి, డాక్టర్.అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, శీలంరమేష్, కౌన్సిలర్లు శివారెడ్డి, ఎస్వీ.రమణ, ఈశ్వర్‌నాయక్, రామిశెట్టి శివయ్య, పాల్‌చంద్రశేఖర్, సర్పంచ్ శరత్‌రెడ్డి, వేణుగోపాల్, మునిశేఖర్, చరణ్, రవితేజ, నర్సింహులు, మహేష్, శారదరెడ్డి, నాగమణి, వినుతా భాయి, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

కేవీపల్లె : రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లెలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాడెద్దులతో నాగలి కట్టి దుక్కిదున్నడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరు అంటే నాగలి అని, ఏరువాక అంటే దుక్కి ప్రారంభం అని పేర్కొన్నారు. ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందించే వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని సూచించారు. వేరుశనగ సాగు, యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రావణి, రమేష్, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానశాఖ, పశుసంవర్ధక అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజానాయక్

కేవీపల్లె : ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని అనంతరాజపేట ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ రాజానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కేవీపల్లె ఆర్‌ఎస్‌కేలో వికసిత్ కృషీ సంకల్ప అభియాన్ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి సాగు చేసిన ఐదు సంవత్సరాల వరకు అంతర్‌పంటలు సాగు చేసుకునే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె. మంజుల, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ డి.నరసింహులు



మాట్లాడుతున్న ఎంపీపీ నరసింహులు

నిమ్మనపల్లె: గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలసి పని చేయాలని ఎంపీపీ డి.నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో గడిచిన మూడు నెలల్లో చేసిన అభివృద్ధి పనులు , వెచ్చించిన నిధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, తాగునీరు వంటి వాటికి అధిక ప్రాధాన్యతను కల్పించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు క్రమం తప్పకుండా చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని, మురుగునీటి కాలువలు శుభ్రపరచాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ పిచికారీ చేయాలన్నారు. మండలంలో కొత్తగా సుమారు రూ.5 కోట్ల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. తాగునీటి అవసరాల కోసం కొత్తగా 8 బోర్లు వేయడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులు ఏర్పడడంతో, మద్యం ఏరులై పారుతోందని బెల్టు షాపులను నియంత్రించాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని శాఖాధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి, సుజాత, ఎంపీటీసీలు, సర్పంచులు, ఏఓ రమేష్ బాబు, సీడీపీఓ నాగవేణి, ఏపీఓ రమేష్, అటవీ శాఖ అధికారి శోభారాణి, ఏఈ లు అమర్నాథ్, నాగరాజ, పంచాయతీ కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం



కలికిరి: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా బుధవారం స్వామి వారికి చక్రస్నానం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాదులు, పల్లకీసేవ నిర్వమించిన అనంతరం సాయంకాలం ధ్వజాఅవరోహణంతో కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. భక్తులు చక్రస్నానానికి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, శ్రీకాంతాచార్యులు, రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి

పీలేరు : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో ఈఈ కార్యాలయం వద్ద పీలేరు, కేవీపల్లె మండలాల విద్యుత్ వినియోగదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీతో అందించే సోలార్ పవర్ జనరేషన్ సిస్టమ్, వాటర్ హీటింగ్ సిస్టమ్, స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్, పంప్‌సెట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ దేవేంద్రనాథరెడ్డి, ఎంపీడీవో శివశంకర్, డీఈఈ అమీర్‌బాషా, నాయకులు పురం రామ్మూర్తి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె తహసీల్దార్‌గా కిషోర్‌కుమార్ రెడ్డి



సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఏఓ నిర్మలాదేవి

మదనపల్లె రూరల్ : మండల తహసీల్దార్‌గా కే.కిషోర్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడి తహసీల్దార్ ధనంజయులును తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలానికి బదిలీ చేశారు. వైఎస్సార్ కడపజిల్లా వీ.ఎన్.పల్లెలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కే.కిషోర్‌కుమార్ రెడ్డిని అడహాక్ పద్ధతిలో అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. బుధవారం మదనపల్లెకు చేరుకున్న కే.కిషోర్‌కుమార్‌రెడ్డి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు మీడియాకు తెలిపారు.

సబ్ కలెక్టరేట్ డీఏఓగా నిర్మలాదేవి

సబ్ కలెక్టర్ కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(డీఏఓ)గా నిర్మలాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామసముద్రం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న కే.నిర్మలాదేవిని సబ్ కలెక్టరేట్ డీఏఓగా నియమించారు.

కలికిరి తహసీల్దార్‌గా డి.హరికుమార్

కలికిరి/ కలకడ: మండల తహసీల్దారు మహేశ్వరిబాయిని బదిలీ చేస్తూ జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దారును కలకడ మండల తహశీల్దారుగానూ, తంబళ్ళపల్లి మండలంలో ఎఫ్ఏసీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దారు డి.హరికుమార్‌ను కలికిరి మండల తహశీల్దారు(ఎఫ్ఏసీ)గా బదిలీ చేశారు.

పటిష్టంగా పూర్వ ప్రాథమిక విద్య

–సీడీపీఓ నాగవేణి

నిమ్మనపల్లె: అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మదనపల్లి సీడీపీఓ నాగవేణి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అంగనవాడీ కేంద్రాలను అభివృద్ధి చేయటానికి, చిన్నపిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను నాణ్యతగా అందించటానికి క్షేత్రస్థాయిలోని అంగన్వాడీ కార్యకర్తలు, కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు . గర్భిణులలో పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నపిల్లలకు మెనూ ప్రకారం పోషకాహారాన్ని అందిస్తూ , కేంద్రాలను పరిశుభ్రంగా నిర్వహించేలా సిబ్బందిని ఆదేశించామన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది' జయప్రదం చేయండి

పీలేరురూరల్ : వారం రోజుల పాటు నిర్వహించనున్న అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 17వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలందరూ ఇంటింటికీ తిరిగి ప్రీ స్కూల్ పిల్లలందరూ అంగవాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి



తహసీల్దార్ అజారుద్దీన్ సత్కరిస్తున్న ఉద్యోగులు

బి.కొత్తకోట: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సంతృప్తి ఉంటుందని తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఇక్కడి నుంచి రామసముద్రం తహసీల్దార్‌గా బదిలీ అయిన ఆయన్ను డీటీ అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్‌ఓలు, కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సమస్యలపై వచ్చే ప్రజల పట్ల సానుభూతితో వ్యవహరించి పరిష్కారం చూపితే ప్రజల్లో మంచిపేరు వస్తుందన్నారు. కాగా బి.కొత్తకోట తహసీల్దార్‌గా బావాజాన్‌ను కలెక్టర్ నియమించారు.